అంటూ.. మూతి గుడ్డ సరిచేసుకుంటూ సైగ చేసింది. మల్లికి భయం వేసింది. అయినా మాట్లాడలేదు.

ఆ అమ్మాయి అలిసిపోయిన గొంతుతో..

''హైవేకేనా!?'' అన్నది.

తల ఊపాడు.

''పదమరి!'' అన్నదామె.

అసలే కరోనా కాలం. అమ్మాయితో కనిపిస్తే పోలీసులు ఏమంటారోనని భయం. చుడీదార్ వేసుకుని అచ్చం హిందీ అమ్మాయిలా ఉన్న ఆమె, తెలుగులో మాట్లాడుతున్నదేమిటని సందేహం. అంతలోనే పోలీస్ విజిల్స్ వినిపించాయి. తిరిగి ఇద్దరూ ఆ రేకుల షెడ్‌లో అలికిడి లేకుండా ఉండిపోయారు. దాదాపు గంటసేపు.. పోలీసుల అలికిడి వినిపిస్తునే ఉంది. ఆ శబ్దాలు సద్దుమణిగాక.. మెల్లగా, సందులు గొందులు దాటుకుంటూ.. పరుగులాంటి నడకతో తెల్లారేసరికి జాతీయ రహదారికి చేరుకున్నారు. తమలాంటి వారే గుంపులు గుంపులుగా హైవే పక్కగా వెళ్తున్నారు. అక్కడక్కడా లారీలు, ట్రక్కులు.. కిటకిటలాడుతున్న జనాలతో పరుగులు తీస్తున్నాయి. ఒక ట్రక్‌లోకి ఎక్కేందుకు మల్లి పరిగెత్తాడు. ఆమె కూడా వెనకే పరిగెత్తింది.

''నువ్వెందుకు?'' అన్నాడు.

''నీతోనే!'' అంటూ ట్రక్ ఎక్కుతున్న తనకు చేయి అందించింది.

లాగి పైకి ఎక్కించాడు.

''దోసౌ పచాస్.. ఎక్కెక్కు!'' అరిచాడు ట్రక్ క్లీనర్.




బ్యాగ్‌లోంచి తీసి ఐదు వందల నోటు ఇచ్చింది.

''నా డబ్బులు నువ్వెందుకిచ్చావు?'' అడిగాడు మల్లి.

''పర్లేదులే!'' అంటూ.. నుదుటి మీద పడుతున్న జుత్తు సద్దుకుంది.

ఓ టోల్‌గోట్‌కు అల్లంత దూరంలో ఆపేసి..

''ఇంక దిగండి!'' అన్నాడు డ్రైవర్.

''పైకి వెళ్లదా!?'' అంటే..

''టోల్‌గేట్ వరకు కూడా వెళ్లదు!'' అంటూ తెగేసి చెప్పాడు క్లీనర్.. ట్రక్ షెటర్ దించుతూ.

అక్కడ దిగినవారంతా పోలీసుల భయంతో హైవే దిగిపోయి.. పక్కనున్న రైలు పట్టాల పక్కగా నడిచి వెళ్లిపోతున్నారు. మల్లి, ఆమె.. వారితోటే నడుస్తున్నారు. నడిచి నడిచి చెమటలు కారుస్తున్నారు. సాయంత్రానికి హైవే బ్రిడ్జి దగ్గరికి చేరుకున్నారు. ఓపిక లేనివారు జాతీయ రహదారి పక్కనే నడుం వాల్చారు. ఆ అమ్మాయి.. 'రా!' అంటూ అక్కడే కూచుండిపోయింది.

మల్లి కూడా కూర్చున్నాడు.

''నువ్వెందుకు సిటీ వదిలి వచ్చేస్తున్నావు'' అడిగాడు మల్లి.

''నువ్వు ఎందుకెళ్తున్నావో.. నేను కూడా అందుకే!'' అన్నది.

సగం హిందీ, సగం తెలుగు భాషలో చీమల్లా మాట్లాడేసుకుంటూ.. అలా ఆ రాత్రి వెలిగే నక్షత్రాలను చూస్తూ, కబుర్లు చెప్పుకొంటూ ఒకరికొకరు పరిచయమే కాదు.. దోస్తులు కూడా అయిపోయారు. ఆమె పేరు కూడా 'మల్లి'నే! తెల్లవారుజాము సమయంలో మళ్లీ పోలీసులు వచ్చి లారీలతో మాట్లాడ్డం మొదలెట్టారు. గుంపుగా మళ్లీ జాతీయ రహదారి వదలి గ్రామాల బాట పట్టారు. మధ్యాహ్నానికి చిన్న టౌన్ చేరుకున్నారు. రోడ్డు పక్కన పాక విలాస్‌లో చాయ్, మధ్యకు చీల్చిన స్వీట్‌బన్ కొనుక్కుని తిన్నారు. ఈసారి విసురుగా పర్స్ తీసి, డబ్బులిచ్చేశాడు మల్లి. కళ్లతోనే నవ్వినట్టు చూసిందామె. మళ్లీ నడక ప్రారంభం. కాళ్లు లాగుతున్నా, చెమటలు కారుతున్నా.. కబుర్లతో అలసట మరచిపోయి నడుస్తున్నారు.

''నువ్వు సిటీకి ఎందుకొచ్చావో, ఎలా వచ్చావో చెప్పావు కానీ.. ఎందుకు వదిలేస్తున్నావో చెప్పలేదేంటి?'' అడిగాడు మల్లి.

''మళ్లీ రాత్రి ఎక్కడో చుక్కలు లెక్కపెడతాం కదా! అక్కడ చెబుతా!'' అన్నది.

సాయంత్రానికి హైవేలో మూసి ఉన్న ఓ పంజాబీ దాబా దగ్గర ఆగింది ఆ గుంపు. అక్కడ సర్దార్‌జీలు వ్యాన్‌లో రోటీ, సబ్జీ పొట్లాలు పంచిపెడుతున్నారు. మల్లి మాత్రం దూరంగా నిలుచున్నాడు.

''సిటీ వదిలేసి చాలా దూరం వచ్చాం. ఇక సిగ్గేంటి?'' అంటూ క్యూలోకి లాక్కెళ్లింది మల్లి.

రోటీ, సబ్జీ రుచిగా ఉన్నాయో.. అలసట, ఆకలి వల్ల అలా అనిపించిందో తెలీదు కానీ, అందరూ గబగబా తినేశారు. సిటీ దాటిన ఐదో రోజుకు ఒక్కో టౌన్‌లో కొందరు కొందరుగా వారివారి గ్రామాల దారి పట్టడంతో.. గుంపు చాలా చిన్నదైపోయింది. రాత్రి తారోదయం అయింది. రోడ్డు పక్కగా అందరూ పడుకొని, ఒకరి బాధలు ఒకరు పంచుకుంటూ.. కునుకులోకి జారుకున్నారు. కాస్త దూరం వెళ్లి సిగరెట్ కాలుస్తున్నాడు మల్లి. ఆమె అతని వైపే చూస్తున్నది. సిగరెట్ ఆర్పేసి మల్లి దగ్గరకొచ్చి..

''కల్వర్టు దగ్గర కూచుందాం రా!'' అన్నాడు.

''అవునూ.. ఐదు చుక్కలు ఆకాశంలో కలిస్తే చెడు జరుగుద్దంటారు కదా! నీకు నమ్మకం ఉందా'' అని అడిగింది.

''ఐదు కాదు.. పది చుక్కలు కలిసుంటాయి. అందుకనే ఇలా దేశాలు పట్టేశాం'' అంటూ కసురుకున్నాడు.

''అన్నట్టు.. హిందీలో గ్రామాన్ని 'దేశ్' అంటారు తెలుసా!?'' అన్నది.

''అవును! మా తాత.. 'మా దేశం ఎల్లొస్తాను!' అనేవాడు తెలుగులోనే. ఇప్పుడు గ్రామాలు, ఊర్లు అంటున్నాం'' అన్నాడు.

మళ్లీ తనే..

''మీ మేడం నిన్ను ఎందుకు పంపేసింది'' అని అడిగాడు.

''అదా.. లాక్‌డౌన్‌లో వాళ్లింటికి వాళ్ల డాక్టర్ మామయ్య వచ్చాడు. పనివాళ్లను పంపేయమని కచ్చితంగా చెప్పాడు. 'వాళ్లు ఇప్పుడు ఎక్కడికెళ్లగలరు!? ఉండనీ!' అన్నది మేడం. రెండు రోజుల తరువాత ఒక రోజురాత్రి.. నేను మేడం స్టూడియోలో పెయింటింగ్స్ సద్దుతున్నాను. మా విల్లా గేట్‌మ్యాన్ నుదుటిమీద చెమట తుడుచుకుంటూ.. నక్కినక్కి వచ్చి నాకు ఓ కబురు చెప్పాడు చెవిలో. దెబ్బకు నాకు కళ్లు తిరిగినట్టయింది. 'లాన్లో పనిచేస్తున్నట్టు నటించు. మెల్లిగా చిన్న గేటు ఓరగా ఉంచుతాను.. పారిపో! నేను కూడా నీ తరువాత పారిపోతా' అని చెప్పాడు. అంతే.. అక్కణ్నుంచి జారుకుని, పోలీసు వ్యాన్ చప్పుడు విని ఆ రేకుల షెడ్‌లో నక్కాను'' చెప్పింది మల్లి.

''గేట్‌మ్యాన్ ఏం చెప్పాడు?'' అడిగాడు మల్లి.

''మేడం వాళ్ల మామయ్య పోలీసులకు ఫోన్‌చేసి.. మేం ఇద్దరం నగలు దొంగతనం చేశామని చెబుతుండగా విన్నాడట. అదే విషయం నాకు చెప్పాడు. అందుకే అక్కణ్నుంచి జారుకున్నాను'' అన్నది మల్లి.

మల్లి ఊరు కూడా తన ఊరికి వంద కిలోమీటర్ల దూరంలోనే ఉన్నట్లు తెలిశాక.. ఇంకా ఏదో దగ్గరతనం ఉన్నట్టు అనిపించింది అతనికి. అలా ఒకరి గత జీవితంలోకి ఇంకొకరు ఈదుతున్న ఆ సూర్యోదయ సమయంలో.. రోడ్డుపైనుంచి ఓ ట్రక్ వెళ్తుంటే గుంపు అందరూ కేకలేసి ఆపారు. రెండు మల్లెలూ ఆ ట్రక్ ఎక్కాయి. ఇంకా అలసట తీరని కొందరు కునుకు తీస్తుంటే, ఒకాయన..

''సిగరెట్టు ఉంటే ఇస్తావా!?'' అంటూ ఆమె వైపు చూస్తూ, అతణ్ని అడిగాడు.

ఆ చూపు నచ్చక వెంటనే సిగరెట్టు తీసి ఇచ్చేశాడు మల్లి. కొండల మధ్య నుంచి దూసుకుపోతున్నది ట్రక్.

''మరి నీకు అంత అన్యాయం చేసిన ఆ విలేకరిని కుళ్లపొడిచి, చంపేయకపోయావా!?'' అన్నాడు మల్లి.

''వాడు నన్ను వాడుకున్నాడు కానీ, తరువాత తప్పయిపోయిందనీ, నాకు సహాయం చేస్తానంటూ.. మేడంకు పరిచయం చేశాడు'' అంటూ తన గతాన్ని మల్లితో పంచుకున్నది.

* * *

మా ఊళ్లో తుఫాను ధాటికి ఇంటిగోడ కూలి అమ్మానాన్న చనిపోయారు. ఐదేళ్లకే ఒంటరిదాన్నయిన నన్ను ఈ మహానగరానికి తీసుకొచ్చాడు మా చిన్నాన్న. చిన్నప్పుడే కాలనీ పక్కనున్న అపార్ట్‌మెంట్‌లో ఇంటి పనులకు కుదిర్చాడు. మా చిన్నాన్న కూడా కొన్నాళ్లకు ఏదో చర్మవ్యాధి వచ్చి చనిపోయాడు. అప్పుడు నాకు 17 ఏళ్లు ఉంటాయి కావొచ్చు. నేను పనిచేసే ఓ అపార్ట్‌మెంట్